**మామునూరు విమానాశ్రయం**

వరంగల్ జిల్లాలోని మామునూర్ విమానాశ్రయాన్ని పునరుద్ధరించనున్నారు. శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి 150 కిలోమీటర్ల పరిధిలో మరో ఎయిర్‌పోర్ట్ ఉండకూడదని గతంలో జీఎంఆర్ సంస్థతో ఒప్పందం కుదిరింది. ఈ నేపథ్యంలో ఆ సంస్థతో పాటు రాష్ట్ర ప్రభుత్వంతో కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు చర్చించారు. మామునూర్‌లో విమానాశ్రయం ఏర్పాటుకు ఒప్పించారు.

## రోజులు-ప్రాధాన్యం

**మార్చి 5**

- ఏటా మార్చి 5న నిరాయుధీకరణ-ఆయుధ విస్తరణ వ్యతిరేక రోజుగా నిర్వహిస్తారు. ఐక్యరాజ్య సమితి సాధారణ సభ 2021లో ఈ రోజును ఏర్పాటు చేసింది. అలాగే అక్టోబర్ 24 నుంచి 30 మధ్య నిరాయుధీకరణ వారంగా నిర్వహిస్తారు.

**మార్చి 3**

- జాతీయ రక్షణ రోజును మార్చి 3న నిర్వహిస్తారు. దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడేందుకు సైన్యం చేస్తున్న కృషికి నిదర్శనంగా దీన్ని చేపడతారు. ఇదే రోజున ప్రపంచ వన్యప్రాణి రోజుగా కూడా ఏటా నిర్వహిస్తారు. ఈ ఏడాది ఇతివృత్తం 'వైల్డ్‌లైఫ్ కన్జర్వేషన్ ఫైనాన్స్: ఇన్వెస్టింగ్ ఇన్ పీపుల్ అండ్ ప్లానెట్'.

**మార్చి 1**

- వరల్డ్ సీ గ్రాస్ డేగా మార్చి 1న నిర్వహిస్తారు. సముద్రాల్లో ఆవరణ వ్యవస్థ, అలాగే జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు ఉద్దేశించింది ఇది. అలాగే ఇదే రోజును ప్రపంచ పౌర రక్షణ రోజుగా కూడా పరిగణిస్తారు.

**ఫిబ్రవరి 28**

- ఏటా ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవంగా నిర్వహిస్తారు. రామన్ ప్రభావాన్ని ఆవిష్కరించిన రోజు నేపథ్యంలో ఈ రోజు చేపడతారు. నవంబర్ 10న అంతర్జాతీయ సైన్స్ దినోత్సవంగా నిర్వహిస్తారు.

## జాతీయం

**సిటీస్ కొలిషన్ ఫర్ సర్క్యులారిటీ**

- నగరాల మధ్య సహకారం, పరిజ్ఞానం మార్పిడి కోసం బహుళ దేశాల కూటమిని 'సిటీస్ కొలిషన్ ఫర్ సర్క్యులారిటీ' పేరుతో భారత్ ఏర్పాటు చేసింది. రాజస్థాన్‌లోని జైపూర్‌లో రీజినల్ 3 ఆర్ అండ్ సర్క్యులర్ ఎకానమీ ఫోరం ఇన్ ఏషియా-పసిఫిక్ సమావేశం నిర్వహించారు. ఇందులోనే కొత్త కూటమి ఏర్పాటును భారత్ ప్రస్తావించింది. రూ. 1800 కోట్ల విలువైన ఒప్పందాలు కూడా ఇందులో భాగంగా కుదిరాయి.

**జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా**

- 1875లో ఏర్పాటు చేసిన ఈ సంస్థ మార్చి 4 నాటికి 175 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా 'గోండ్వానా బేసిన్స్ అన్ ది ఇండియన్ సబ్ కాంటినెంట్' అనే ప్రచురణను అందుబాటులోకి తెచ్చింది. 'భూ విరాసత్' పేరుతో ఒక యాప్‌ను కూడా ఆవిష్కరించింది.




**ప్రపంచ సుస్థిరాభివృద్ధి సమావేశం**




- ప్రపంచ సుస్థిరాభివృద్ధి సమావేశాన్ని మార్చి 5న న్యూఢిల్లీలో ప్రారంభించారు. సుస్థిరాభివృద్ధి చర్యలను వేగవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఏర్పాటు చేసిన సమావేశం ఇది. ది ఎనర్జీ అండ్ రిసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్ దీన్ని నిర్వహించింది.

**సెమీ కండక్టర్ ఫ్యాబ్**

- దేశంలో తొలి వాణిజ్య సెమీ కండక్టర్ ఫ్యాబ్రికేషన్ యూనిట్‌ను గుజరాత్‌లోని ధోలేరాలో నిర్మించనున్నారు. ఇందుకు ఇండియా సెమీ కండక్టర్ మిషన్, టాటా ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, టాటా సెమీ కండక్టర్ మ్యానుఫ్యాక్చరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంతకం చేశాయి. దీనివల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా 20,000 మందికి ఉపాధి అవకాశాలు రానున్నాయి.

**రోప్‌వే ప్రాజెక్ట్**

- ఉత్తరాఖండ్‌లోని సోన్ ప్రయాగ్ నుంచి కేదర్ నాథ్ వరకు 12.9 కిలో మీటర్ల రోప్ వే ప్రాజెక్ట్‌కు కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. దీనికి రూ. 4081.28 వ్యయం చేయనున్నారు. అలాగే ఇదే రాష్ట్రంలో గోవింద్ ఘాట్ నుంచి హేమ్‌కుండ్ సాహిబ్‌జీ వరకు కూడా రోప్‌వేను 12.4 కిలోమీటర్లు నిర్మించనున్నారు. ఇందుకు రూ. 2730.13 కోట్లు వ్యయం చేయనున్నారు.

**పర్యావరణ అధ్యాయం**

- అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పర్యావరణానికి ప్రత్యేకంగా ఒక అధ్యాయాన్ని కేటాయించారు. 'సుస్థిర-పర్యావరణ బడ్జెట్' పేరుతో ఇది ఉంది. ఒక మున్సిపాలిటీ ఈ తరహా నిర్ణయం తీసుకోవడం దేశంలో ఇదే ప్రథమం.

**డాల్ఫిన్ల గణన**

- దేశంలో 6327 నదీ డాల్ఫిన్లు ఉన్నట్లు కేంద్రం ప్రకటించింది. తొలిసారి వీటి గణన చేపట్టారు. అతి ఎక్కువగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ఉన్నాయి. ఇక్కడ 2397 ఉన్నట్లు గుర్తించారు. ఆ తర్వాత వరుసగా బీహార్, పశ్చిమబెంగాల్, అస్సాం, జార్ఖండ్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో ఇవి కనిపించాయి.



**ఐఆర్‌సీటీసీ, ఐఆర్‌ఎఫ్‌సీ**

- ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ లిమిటెడ్, ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్‌లకు నవరత్న హోదాను కేంద్రం కల్పించింది. దీంతో నవరత్న సంస్థల సంఖ్య 26కు చేరుకుంది.

**జీవ ఇంధనాల ఉత్పత్తి**

- జీవ ఇంధనాల ఉత్పత్తిలో భారత్ మూడో స్థానానికి చేరింది. తొలి స్థానంలో అమెరికా ఉండగా రెండో స్థానంలో బ్రెజిల్ ఉంది. జనవరి 2025 నాటికి భారత్ జీవ ఇథనాల్ బ్లెండింగ్‌ను 19.6% సాధించింది. నిజానికి భారత్ లక్ష్యం 2030 నాటికి 20% ఇథనాల్ బ్లెండింగ్‌ను సాధించడం.

## అంతర్జాతీయం

**ఐక్యరాజ్య సమితి**

- హిందీ @ యూఎన్ ప్రాజెక్ట్ పునరుద్ధరణకు భారత్, ఐక్యరాజ్య సమితులు అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. మొదట ఈ ఒప్పందం 2018లో కుదిరింది. తాజా పునరుద్ధరణతో 2025, ఏప్రిల్ 1 నుంచి 2030, మార్చి 31 వరకు అమలు చేస్తారు.




**ప్రపంచ ఆహార కార్యక్రమం**

- ఇటలీలోని రోమ్ కేంద్రంగా ఈ సంస్థ పనిచేస్తుంది. అమెరికా ఆర్థిక సాయం నిలిపిన నేపథ్యంలో ఆఫ్రికా ఖండం దక్షిణ ప్రాంతంలో తన కార్యకలాపాలను నిలిపివేసింది.

**యునెస్కో**

- ప్రపంచ వ్యాప్తంగా 40% మంది విద్యార్థులకు మాతృభాషలో విద్య అందడం లేదని యునెస్కో గ్లోబల్ ఎడ్యుకేషన్ మానిటరింగ్ నివేదిక పేర్కొంది. కనీసంగా ప్రాథమిక విద్య అయినా మాతృభాషలో ఉండాలని పేర్కొంది.

UNESCO Global Education Monitoring Report

## తెలంగాణ

**శాసన మండలి ఎన్నికల విజేతలు**

- కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్ జిల్లాల పట్టభద్రులు నియోజకవర్గం ఎమ్మెల్సీగా భారతీయ జనతా పార్టీకి చెందిన అంజిరెడ్డి గెలిచారు.
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉమ్మడి నల్లగొండ-వరంగల్-ఖమ్మం ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ స్థానంలో పింగళి శ్రీపాల్‌రెడ్డి గెలిచారు.
- ఉమ్మడి కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీగా మల్క కొమరయ్య ఎన్నికయ్యారు.

**లెన్స్‌కార్ట్ పరిశ్రమ**



- తెలంగాణలో భారీ కళ్ల అద్దాల పరిశ్రమ ఏర్పాటు కానుంది. ప్రపంచంలోనే బ్రాండెడ్ సంస్థగా పేరున్న లెన్స్‌కార్ట్ హైదరాబాద్ శివారులోని తుక్కుగూడలో నాన్ సెజ్ జనరల్ పార్క్‌లో ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించనుంది. రూ. 1500 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. సుమారుగా 1600 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించనుంది.

**ఎలివేటెడ్ కారిడార్**

- హైదరాబాద్, శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. దీని అంచనా వ్యయం సుమారు రూ. 7700 కోట్లు. 30 అడుగుల ఎత్తులో నిర్మించనున్నారు. ఇది పూర్తయితే వన్యప్రాణులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రయాణం సులువు అవుతుంది. అలాగే హైదరాబాద్, శ్రీశైలం ప్రయాణ సమయం 45 నిమిషాలు తగ్గనుంది.

**ఏఐ పాఠాలు**

- ఒకటో తరగతి నుంచి కృత్రిమ మేధ పాఠాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వచ్చే విద్యా సంవత్సరం ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు గణితంలో ఒక పాఠంగా కృత్రిమ మేధను ప్రవేశపెడతారు.

**రాజస్థాన్‌తో ఒప్పందం**

- రాజస్థాన్ ప్రభుత్వ సంస్థతో సింగరేణి ఒప్పందం చేసుకుంది. కొత్తగా ఉమ్మడి భాగస్వామ్య సంస్థను ఏర్పాటు చేయనున్నాయి. ఇందులో సింగరేణికి 74, ఆర్‌వీఎన్ఎల్‌కు 26% వాటాలుంటాయి. రాజస్థాన్ వాటాలో భాగంగా భూమిని కేటాయించి మౌలిక సదుపాయాలు కల్పిస్తారు. సింగరేణి వాటా కింద పెట్టుబడి సొమ్మును సమకూర్చనున్నారు. కొత్త సంస్థ తరఫున మొత్తం రూ 26,200 కోట్ల పెట్టుబడులతో తెలంగాణలో 1600 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంట్‌ను, రాజస్థాన్‌లో 1500 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నారు.

**మౌనిక ఘనత**



- సింగరేణి భూగర్భ రక్షణ బృందంలో అంబటి మౌనిక నియమితులయ్యారు. 132 సంవత్సరాల సింగరేణి చరిత్రలో ఈ బాధ్యతలో ఒక మహిళ నియమితులు కావడం ఇదే ప్రథమం. ప్రస్తుతం మౌనిక వీకే-5 గనిలో విధులు నిర్వహిస్తుంది. ఆమె ఖమ్మం జిల్లాకు చెందిన వ్యక్తి.

**పీహెచ్‌సీలో గ్లకోమా కేంద్రం**



- నల్లగొండ జిల్లా కనగల్ పీహెచ్‌సీలో గ్లకోమా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఒక పీహెచ్‌సీలో ఈ కేంద్రం రావడం రాష్ట్రంలో ఇదే ప్రథమం.

**రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయాలు**

- బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో 42% రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయించింది.

**ఇతర నిర్ణయాలు**

- ఎస్సీ వర్గీకరణపై జస్టిస్ షమీమ్ అక్తర్ ఇచ్చిన సవరణ నివేదికకు ఆమోదం
- రాష్ట్రాన్ని కోర్, అర్బన్, రూరల్ సెక్టార్లుగా విభజన, రీజినల్ రింగ్ రోడ్ బఫర్ (2 కిలోమీటర్లు) వరకు హెచ్ఎండీఏ పరిధి విస్తరణ
- తెలంగాణ తొలి పర్యాటక విధానానికి ఆమోదం
- యాదగిరిగుట్ట ఆలయానికి స్వయం ప్రతిపత్తి కల్పించేలా ప్రత్యేక ట్రస్ట్ బోర్డు ఏర్పాటుకు ఆమోదం
- రెవెన్యూ శాఖలో 10,954 గ్రామస్థాయి పరిపాలనా అధికారుల పోస్టులు మంజూరు, 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టులకు కూడా క్యాబినెట్ ఆమోదం
- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసేందుకు ఇందిర 'మహిళా శక్తి మిషన్-2025' విధానానికి ఆమోదం
- శంషాబాద్ మండలం పెద్ద గోల్కొండ సమీపంలో ఈఎస్ఐ ఆస్పత్రి కోసం 5.15 ఎకరాల కేటాయింపు
- 2024 పారాలింపిక్స్ కాంస్య పతక విజేత దీప్తికి ప్రభుత్వ ఉద్యోగం

## వార్తల్లో వ్యక్తులు

**అన్జు రతి రాణా**

- కేంద్ర న్యాయ శాఖ నూతన కార్యదర్శిగా అన్జు రతి రాణా నియమితులయ్యారు. ఈ బాధ్యతను చేపట్టిన తొలి మహిళగా ఆమె రికార్డు సృష్టించింది.

**అజయ్ బాదూ**

- గవర్నమెంట్ ఈ మార్కెట్ ప్లేస్ విభాగానికి కొత్త సీఈవోగా అజయ్ బాదూను నియమించారు.

**జై షా**





- ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడు జై షాకు ప్రతిష్ఠాత్మక ఫోర్బ్స్ ఇండియా లీడర్‌షిప్ అవార్డ్ దక్కింది.

**యమండు**

- ఉరుగ్వే దేశానికి కొత్త అధ్యక్షుడిగా యమండు నియమితులయ్యారు.

**క్రిస్టియన్ స్టోకర్**

- ఆస్ట్రియా నూతన చాన్స్‌లర్‌గా క్రిస్టియన్ స్టోకర్ బాధ్యతలను స్వీకరించారు. ఆ దేశంలో ఇదే ప్రభుత్వాధినేత పదవి.



వి. రాజేంద్ర శర్మ
ఫ్యాకల్టీ
9849212411

